క్లుప్తంగా

రవాణా శాఖ మంత్రిని కలిసిన ఎర్రవల్లి జాఫర్



ఎర్రవల్లి జాఫర్‌ను సన్మానిస్తున్న రవాణా శాఖ మంత్రి పొన్నం

అనంతగిరి: రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్ పాల్గొని పలు సమస్యలపై రాష్ట్ర రవాణామంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్‌తో చర్చించారు. పలు సమస్యలు పరిష్కరించాలని వారి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆర్టీఏ సభ్యుడిని మంత్రి పొన్నం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

సాగు వివరాల నమోదు తప్పనిసరి



సిరిపురంలోని ఓ రైతు పొలంలో డిజిటల్ సర్వే చేస్తున్న ఏఈఓ మహేశ్

మర్పల్లి: యాసంగిలో రైతులు సాగు చేసిన పంట వివరాలను తప్పని సరిగా డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదు చేయించుకోవాలని సిరిపూరం క్లస్టర్ ఏఈఓ మహేశ్ పేర్కొన్నారు. శుక్రవారం సిరిపూరం రైతు వేదిక క్లస్టర్ పరిధిలోని సిరిపూరం గ్రామంలో 80 ఎకరాలకు పైగానే రైతుల పొలాల వద్దకు వెళ్లి డిజిటల్ సర్వే చేసి ఆన్‌లైన్లో నమోదు చేసినట్లు మహేశ్ తెలిపారు. పంట సాగు చేసిన ప్రతిఒక్కరూ తప్పని సరిగా డిజిటల్ క్రాప్ సర్వే చేయించుకుంటే మార్కెట్‌లో లేదా కొనుగోలు కేంద్రాల్లో విక్రయం చేసేందుకు సులభమౌతుందన్నారు.

బండల ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని బండల ఎల్లమ్మ అమ్మవారికి శుక్రవారం జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ చల్లంగ చూడాలంటూ అమ్మవారిని వేడుకున్నట్లు భక్తులు తెలిపారు.

అంజన్న ఆలయంలో శివ స్వాముల పూజలు



మామిడి కుంట ఆంజనేయ స్వామి దేవాలయంలో శివ స్వాములు

దుద్యాల్: మండల పరిధిలోని చిలుముల మైల్వార్ గ్రామంలోని అడవిలో వెలసిన మామిడికుంట ఆంజనేయ స్వామి దేవాలయంలో శివ స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హస్నాబాద్ గ్రామానికి చెందిన గొల్ల రాములు శివ స్వాములకు అన్నదానం ఏర్పాటు చేశారు. అంతకుముందు స్వాములు అక్కడ ప్రత్యేక పూజలు, భజన నిర్వహించారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

షాబాద్: అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కులగణన, ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో బిల్లు పాస్ చేసిందన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని సూచించారు. పార్టీ నాయకులంతా ఐక్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. కార్యకర్తల సమస్యలు తెలుసుకొని దశల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఇచ్చిన హామీల మేరకు మాట తప్పకుండా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సాధ్యమని పేర్కొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందేనా?

- పెరగని కొడంగల్ చెరువు విస్తీర్ణం
- పూర్తి స్థాయిలో అందని సాగునీరు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



కొడంగల్ చెరువు కట్టపై ఏర్పడిన పగుళ్లు

కొడంగల్: మున్సిపల్ పరిధిలో కొడంగల్ చెరువుకు 550 ఎకరాల ఆయకట్టు ఉంది. సుమారు 250 మంది రైతులకు ఈ చెరువు కింద పొలాలు ఉన్నాయి. పెద్ద చెరువుగా పేరుగాంచినప్పటికీ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరందడం లేదు. ఆయకట్టు విస్తీర్ణం ప్రతి ఏడాది తగ్గుతూ వస్తోంది. కొడంగల్ చెరువు ఒక్కటే కాదు. మండల పరిధిలోని హస్నాబాద్ చెరువు పరిస్థితి కూడా అలాగే ఉంది. హస్నాబాద్ చెరువుకు 950 ఎకరాల ఆయకట్టు ఉంది. మండలంలో నోటీఫైడ్ చెరువులుగా గుర్తించిన పెద్ద నందిగామ చెరువు, అంగడిరాయిచూర్ చెరువు, పర్సాపూర్ చెరువులదీ అదే పరిస్థితి ఉంది. దీంతో ఈ ప్రాంతాల్లో చెరువులు నిండవు.. పొలాలకు సాగునీరందదు అన్నట్టు పరిస్థితి తయారైంది. ఎందుకంటే చెరువులకు మరమ్మతులు చేయకపోవడమే కారణం. గతంలో మిషన్ కాకతీయ పథకంలో నామమాత్రంగా పనులు నిర్వహించారు. దీంతో చెరువుల్లోకి వర్షం నీరు వచ్చినా రైతులకు మేలు జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. వర్షంపై ఆధార పడి ఇక్కడి రైతులు వ్యవసాయం చేస్తున్నారు. వర్షం పడకపోతే తమకు ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలకు పైగా చెరువులు, కుంటలకు మరమ్మతులు చేయకపోవడం వల్లే చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది.



కొడంగల్ చెరువులో పెరిగిన కంప చెట్లు

దీంతో ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. వందల ఎకరాల్లో ఆయకట్టు ఉంటే రెవెన్యూ అధికారులు తైబందీ నిర్వహించి నాలుగో వంతు ఆయకట్టుకు కూడా సాగునీరందించడం లేదని రైతులు వాపోతున్నారు. సాగు నీటి పారుదల శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా కొడంగల్ నియోజకవర్గంలో సాగునీటి వ్యవస్థ అధ్వానంగా మారింది. పంట పొలాలకు సాగునీరందక రైతులు వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వేసవిలో చెరువులకు మరమ్మతులు చేయించి సాగు విస్తీర్ణం పెరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పంటల సాగు పెరిగితేనే వ్యవసాయం గిట్టుబాటు అవుతుందని రైతులు వాపోతున్నారు. కొడంగల్ చెరువులో కంప చెట్లు ఎక్కువగా పెరిగాయి. చెరువు కట్టకు పగుళ్లు కూడా వచ్చాయి. గత పాలకులతో పాటు ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ రైతుల సంక్షేమాన్ని కాంక్షించే కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా చెరువులకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు

మాజీ సర్పంచ్ శిరీష

దౌల్తాబాద్: చదువుకు పేదరికం అడ్డుకాదని దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లో ఉందని మాజీ సర్పంచ్ శిరీషరమేశ్ పేర్కొన్నారు. 2023–24 సంవత్సరంలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో మండల టాపర్‌గా నిలిచిన దౌల్తాబాద్‌కు చెందిన విద్యార్థిని అక్షయకు శుక్రవారం మొదటి బహుమతిగా రూ.3వేలు, రెండోవ బహుమతి గుముడాల గ్రామానికి చెందిన నిహారికకు రూ.2,500లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి మొదటి స్థానంలో నిలిచేలా చదువుకోవాలన్నారు. రిటైర్డ్ ఎంఈఓ బాబుసింగ్, రిటైర్డ్ టీచర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

‘సాక్షి’ సేవలు అభినందనీయం



మరికల్ జెడ్పీ పాఠశాలలో స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంఈఓ రాంచందర్, సాక్షి టీం తదితరులు

చౌడాపూర్ ఎంఈఓ రాంచందర్

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సాక్షి మీడియా కృషి అభినందనీయమని చౌడాపూర్ మండల ఎంఈఓ రాంచందర్ పేర్కొన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండల పరిధిలోని చౌడాపూర్, మందిపల్, మరికల్ గ్రామాల్లోని జెడ్పీ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు సాక్షి మీడియా ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లోని పేదవిద్యార్థుల ఉన్నతికి సహకరించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు భాగ్యవతి, సర్వమంగళ, మరికల్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సీఆర్పీ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు హన్మయ్య, విజయ్‌శ్రవణ్, మల్లయ్య, రాజు, పాండురంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



ప్యాడ్లు పంపిణీ చేసిన ఉపాధ్యాయిని శాంతి తదితరులు

యాలాల: విద్యార్థులు చదువులో రాణించి, ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని చెన్నారం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం కరణం లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయిని శాంతి ఏడో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశ్రీ, సుమలత పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్

షాబాద్: నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్ఎఫ్ వరమని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని లక్ష్మారావుగూడ గ్రామానికి చెందిన రాళ్లగూడెం అమృతరెడ్డికి రూ.60 వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం బాధ్యతగా తీసుకుంటామన్నారు. తెల్ల రేషన్‌కార్డు, ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉన్న ప్రతిఒక్కరూ ఈ పథకానికి అర్హులని తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలంతా రుణపడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ చేవెళ్ల అధ్యక్షుడు పెంటారెడ్డి, నాయకులు సుభాశ్, వెంకటయ్య, మాధవరెడ్డి, సత్తయ్య, కుమార్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు



మొయినాబాద్‌రూరల్: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందని మండలంలోని కనకమామిడి మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలో అయాన్ మెడికల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ధనలక్ష్మి, అబ్దుల్లా, సిద్ధిఖ్, అబీబ్, స్వాతి, కైసర్, రఘునాథ్ పాల్గొన్నారు.

నేడు సంత్ సేవాలాల్ జయంతి

కొందుర్గు: బంజారాల ఆరాధ్య దైవమైన సంతు సేవాలాల్ జయంతి ఉత్సవాలను జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో శనివారం నిర్వహిస్తున్నట్లు లంబాడ హక్కుల పోరాట సమితి మండలాధ్యక్షుడు రామ్‌చరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని తండాలకు చెందిన గిరిజన సోదరులు, సోదరీమణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాభివృద్ధికి కృషి

యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

యాలాల: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అగ్గనూరు గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ యాలాల మండల అధ్యక్షుడు వీరేశం ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్, ఎంపీటీసీ భీమప్ప, గరివప్పలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ..అడిగిన వెంటనే గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులు కేటాయించారన్నారు. గ్రామంలో అవసరమైన చోటా సీసీ, డ్రైనేజీ నిర్మాణా పనునలను చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు వెంకటయ్య, అశోక్, మహి, నరేందర్, రమేష్, గోపి, హన్మంతు, సాయి, రఘు, సుమన్, శేఖర్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్లకు ఘన నివాళి



తాండూరు టౌన్‌లో నివాళులర్పిస్తున్న యువత



బొంరాస్‌పేటలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: ఉగ్రదాడిలో అసువు బాసిన వీర జవాన్లకు పలువురు ఘన నివాళులర్పించారు. శుక్రవారం రాత్రి స్థానిక శివాజీ చౌక్‌లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కొవ్వొత్తులు వెలిగించి అమర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం ఫిబ్రవరి 14వ తేదీన జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన బాంబు దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు, యువత, పార్టీలకతీతంగా నాయకులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: ఉగ్రవాదుల చేతుల్లో వీర మరణం పొందిన పుల్వామా జవాన్లకు ఘన నివాళులర్పించారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో వీధులగుండా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి వీరజవాన్ల చిత్రపటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్‌సాగర్ నాయకులు రాజేశ్‌నాయక్, మోహన్‌యాదవ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అమరులను మరవొద్దు

చేవెళ్ల: దేశంలో కోసం తమ ప్రాణాలను త్యాగం చేస్తున్న అమరవీరులను ఎప్పటికీ మరవొద్దని బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లకు నివాళులర్పించారు. అలాగే కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత సుష్మా స్వరాజ్ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. అమరవీరులను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించాలని నేతలు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్గీకరణను నిలిపేయాలంటూ నిరసన

తాండూరు టౌన్: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కుల గణనలో ఎస్సీ మాల కులాన్ని తక్కువ జనాభా ఉన్నట్లుగా గుర్తించిందని ఆరోపించారు. దీంతో ఎస్సీ వర్గీకరణలో కేవలం 5శాతం రిజర్వేషన్ కేటాయించాలని చూస్తోందన్నారు. ఈ విషయంలో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాల మహానాడు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శేఖర్, లాలప్ప, రాములు, సలహాదారు మల్లప్ప, నాయకులు జగదీశ్వర్, అంజయ్య, నరేష్, విజయ్, మల్లేశం, శ్రీనివాస్, శానప్ప, కాశప్ప, రమాకాంత్, రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా విగ్రహాల ప్రతిష్ఠ



అభిషేకం నిర్వహిస్తున్న గిరిజన ఉద్యోగ సంఘం అధ్యక్షుడు రాంచందర్ నాయక్

కుల్కచర్ల: ముక్తవెంకటాపూర్ గ్రామంలో సేవాలాల్, మరియమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ఏర్పాటు, బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉత్సవాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలతో పాటు సేవాలాల్ జయంతి నిర్వహించనున్నారు. శుక్రవారం సామూహిక హోమం నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా గిరిజన రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాంచందర్ నాయక్ కుటుంబ సమేతంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణతో భక్తిభావం పెరుగుతుందన్నారు. దీంతో గ్రామాల్లో ప్రశాంతవాతావరణం నెలకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాందాస్ నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, లాలు, రాజు, రవి, పులిరాములు, జాను, అర్చకులు మఠం రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓకు సన్మానం



కృష్ణారావును సన్మానిస్తున్న మురహరి వశిష్ఠ

కొడంగల్: నియోజకవర్గ పరిధిలోని కొత్తపల్లి మండలంలో ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన దుబ్బాస్ కృష్ణారావును లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కొడంగల్ పట్టణానికి చెందిన కృష్ణారావ్ నారాయణపేట జిల్లాలో విధులు నిర్వహించేవారు. ఆయనకు పదోన్నతి లభించి కొత్తపల్లి మండలానికి ఎంపీడీఓగా నియమించారు. దీంతో ఆయన బాల్య మిత్రులు, కొడంగల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ఠ, లయన్స్ క్లబ్ సభ్యులు మునీర్, కానుకుర్తి రమేశ్ తదితరులు శుక్రవారం కొత్తపల్లి మండలానికి వెళ్లి కృష్ణారావ్‌ను సన్మానించారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని స్వామి వివేకానంద స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు 33మంది అధికారులుగా, ఉపాధ్యాయులుగా వివిధ హోదాల్లో ఒకరోజు విధులు నిర్వహించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా విజయ్, ఎంఈఓగా శ్రీనివాస్, హెచ్ఎంగా స్వస్తిక్, పీఈటీగా ఆనంద్, ఉపాధ్యాయులుగా నవీన్, నందిని, శ్రీలత, మనీషాతోపాటు ముప్పైమంది విద్యార్థులు విధులు నిర్వహించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ నర్సింలు, హెచ్ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు నిరోషా, శ్యామల, విజయలక్ష్మీ, లక్ష్మి, శ్రీదేవి, భాగ్య, ప్రమీల బహుమతులు అందజేసి అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

దోమ: అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు తోటి స్నేహితులు సాయం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..దొంగ ఎన్కేపల్లి గ్రామానికి చెందిన బాస్‌పల్లి చంద్రయ్య కుటుంబ సమస్యలతో పాటు అనారోగ్య సమస్యతో కొంత కాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. గురువారం రాత్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి తోటి స్నేహితులందరూ రూ.16వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శేరిరాంరెడ్డి, బాబ్యా, శ్రీనివాస్, బాల్‌రాజ్, ఈశ్వరయ్య, దేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బోరుమోటార్ ప్రారంభం

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని ఫాతీమాపూర్ గ్రామంలో శుక్రవారం కమిషనర్ బాలాజీ స్థానిక నాయకులతో కలిసి బోరుమోటార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీరోడ్డు తవ్వకాల కారణంగా కొన్ని రోజుల నుంచి గ్రామానికి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయినట్లు తెలిపారు. దీంతో స్థానికులు నీటి సమస్యను పరిష్కరించాలని కోరగా గ్రామంలోనే మున్సిపాలిటీ నిధులతో బోరు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్ యాదవ్, యాదయ్య, ఆల్విన్‌రెడ్డి, మెండెకృష్ణ, బాల్‌శౌరిరెడ్డి, దిలిప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పనులు పూర్తి చేయండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్: నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: ఆస్పత్రి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆస్పత్రి భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని, నాలుగైదు నెలల్లో సేవలందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదన్నారు. ఆస్పత్రిలో అత్యాధునిక హంగులతో డయాసిస్ కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేసిందన్నారు. పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, అశోక్, రమేష్‌గౌడ్, సురేష్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, శ్రీధర్, ఫకీర్ బాషా, లక్ష్మీకాంత్‌రెడ్డి, రమేష్, శంకరయ్య, శ్రీనివాస్, ముబారక్, శ్రీశైలం, శేఖర్, కిట్టు పాల్గొన్నారు.

దైవ చింతనతోనే ప్రశాంతత

నందిగామ: సమాజంలో ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మండల పరిధిలోని చేగూరులో సాయిబాబా దేవాలయ 16 వార్షికోత్సవాన్ని గ్రామస్తులు శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి తమ దైనందిన జీవితంలో ఎంతో కొంత మానసిక ప్రశాంతత అవసరమని, దీనికి తప్పని సరిగ్గా భక్తిభావం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు శివశంకర్ గౌడ్, ప్రియాంక, నాయకులు శ్రీశైలం, శ్రీనివాస్, రాజు, వీరేందర్‌గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.